
సాక్షి
బాపట్ల


గురువారం । 5 । జనవరి । 2023



సాగునీటి సమాచారం
తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 1,016 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 915 క్యూసెక్కులు వదిలారు.



పులిచింతల నీటినిల్వ
అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 44.3327 టీఎంసీలు. ప్రాజెక్టు ఎగువ నుంచి 2,000 క్యూసెక్కులు వస్తుండగా దిగువకు 2200 క్యూసెక్కులు వదులుతున్నారు.

కరోనా జీరో


గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా బుధవారం ఒక్క కరోనా పాజిటివ్ కేసు కూడా నమోదు కాలేదు. ఎక్కడా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ
నాలుగో రోజుకు 98.21 శాతం పూర్తి



నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ నాలుగో రోజు సజావుగా సాగింది. వలంటీర్లు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి నగదు అందజేశారు. గుంటూరు జిల్లాలో 98.21 శాతం పంపిణీ పూర్తయింది. ఈ నెలలో 2,54,123 మంది లబ్ధిదారులు ఉండగా ప్రభుత్వం రూ.69.81 కోట్లు కేటాయించింది. బుధవారం సాయంత్రానికి 2,49,575 మంది లబ్ధిదారులకు రూ.68.55 కోట్ల నగదును వలంటీర్లు అందజేశారు.

సజావుగా ఎస్‌ఏ-1 పరీక్షలు



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సమ్మేటివ్ అసెస్‌మెంట్(ఎస్‌ఏ)-1 పరీక్షలు బుధవారం సజావుగా జరిగాయి. ఒకటి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు రాష్ట్ర విద్య పరిశోధన, శిక్షణ మండలి (ఎస్సీఈఆర్టీ) రూపొందించిన ఉమ్మడి ప్రశ్నపత్రం ద్వారా ముందుగా విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈనెల 2న మొదలైన పరీక్షలకు గుంటూరు జిల్లా వ్యాప్తంగా 1,687 పాఠశాలల పరిధిలో 3,02,975 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఓఎంఆర్ షీట్ విధానంలో పరీక్షలు నిర్వహించనుండగా 9,10 తరగతులకు గతంలో మాదిరిగా ప్రశ్నపత్రాల విధానంలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. బుధవారం ప్రథమ భాష పరీక్ష జరిగింది.

ఫిబ్రవరి 11, 12 తేదీల్లో హెచ్‌ఎం అకౌంట్ టెస్టు
గుంటూరు ఎడ్యుకేషన్: ఫిబ్రవరి 11, 12 తేదీల్లో హెడ్ మాస్టర్స్ అకౌంట్ టెస్ట్ నిర్వహణకు ప్రభుత్వ పరీక్షల విభాగ డైరెక్టర్ ఎం. దేవానందరెడ్డి బుధవారం షెడ్యూల్ విడుదల చేసినట్లు డీఈవో పి.శైలజ తెలిపారు. ఫిబ్రవరి 11న పేపర్-1 (వితౌట్ బుక్స్), 12న పేపర్-2 (విత్ బుక్స్) పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగనున్నాయని పేర్కొన్నారు.

18న డీఎడ్ ప్రాక్టికల్స్
గుంటూరు ఎడ్యుకేషన్: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎడ్) 2020-22 బ్యాచ్ విద్యార్థులకు నాలుగో సెమిస్టర్ ప్రాక్టికల్స్‌ను ఈనెల 18 నుంచి 21 వరకు నిర్వహించనున్నట్లు డీఈఓ పి.శైలజ బుధవారం తెలిపారు. జిల్లాలోని డీఎడ్ కళాశాలల ప్రిన్సిపాల్స్ షెడ్యూల్‌ను అనుసరించి ఒకే స్పెల్‌లో ప్రాక్టికల్స్ నిర్వహణకు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. దీనిపై ప్రభుత్వ డైట్ కళాశాలలో డీఎడ్ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులతో సమావేశాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 578.70 అడుగుల వద్ద ఉంది. ఇది 279.2578 టీఎంసీలకు సమానం. కుడికాలువకు 9,217, ఎడమ కాలువకు 8,807, ఎస్‌ఎల్‌బీసీకి 2,400, వరద కాలువకు 400 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మొత్తం ఔట్‌ఫ్లోగా 20,824 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి 866 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 856.00 అడుగుల వద్ద ఉంది. ఇది 94.4570 టీఎంసీలకు సమానం.

41,940 బస్తాల మిర్చి రాక
కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 41,940 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 40,183 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.27,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.27,000 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాలుకు రూ.10,000 నుంచి రూ.23,000 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.9,000 నుంచి రూ.26,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,200 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 13,315 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.



పల్నాడు జిల్లా కారంపూడి మండలంలో పింఛన్ పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



బాపట్ల జిల్లా నగరంలో పెన్షన్ కానుక అందిస్తున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



గుంటూరు జిల్లా మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ కార్యాలయంలో పెన్షన్ కానుక అందిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

స్పాట్‌లైట్

రోడ్డు ప్రమాదాల కట్టడికి చర్యలు
- పల్నాడు జిల్లాలో 97 బ్లాక్ స్పాట్ల గుర్తింపు
- 2022లో తగ్గిన ప్రమాదాలు, మరణాల సంఖ్య
- సత్ఫలితాలిస్తున్న పోలీస్, రవాణా శాఖల కృషి
- అతివేగం, నిర్లక్ష్యం, మద్యపానం వల్లే దుర్ఘటనలు

వారంతా రెక్కాడితేగానీ డొక్కాడని వ్యవసాయ కూలీలు. మొత్తం 38 మంది మినీ లారీలో శ్రీశైలం దైవదర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా, ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మినీలారీ అతివేగంగా వచ్చి ఆగి ఉన్న సిమెంట్ లారీని ఢీకొట్టింది. ఫలితంగా ఏడుగురు దుర్మరణం పాలయ్యారు. 15 మంది క్షతగాత్రులయ్యారు. 22 కుటుంబాలు తీరని విషాదంలో మునిగిపోయాయి. అతివేగంతోపాటు నిద్రమత్తు వల్లే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తేల్చారు. ఇలాంటి ప్రమాదాలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. ఎంతో మందిని పొట్టన పెట్టుకుంటూనే ఉన్నాయి. వీటి నియంత్రణకు పల్నాడు పోలీసు శాఖ కట్టుదిట్ట చర్యలు చేపట్టింది. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలపై దృష్టిపెట్టింది.



గతేదాది మేనెలలో రెంటచింతల వద్ద జరిగిన రోడ్డు ప్రమాద దృశ్యం

సాక్షి, నరసరావుపేట : పల్నాడు ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి రోడ్డు ప్రమాదాల కట్టడికి కంకణం కట్టుకున్నారు. దీనికోసం పకడ్బందీ కార్యాచరణ చేపట్టారు. ప్రమాదాలు అధికంగా జరిగే రహదారులు, ప్రదేశాల గుర్తింపునకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఆ ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు, స్పీడ్‌బ్రేకర్లు, రేడియం స్టిక్కర్లు, సోలార్ బ్లింకర్స్ జీబ్రాక్రాసింగ్‌లు, ఇసుక డ్రమ్ములు, సైన్‌బోర్డులు ఏర్పాటు చేయించారు. తరచూ ప్రమాదాలు సంభవించే ప్రాంతాల్లో స్వయంగా పర్యటించి పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రహదారి భద్రతపై వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ప్రమాదకర మలుపులు, జంక్షన్ల వద్ద పోలీసులను కాపలా ఉంచి వాహనాలను నియంత్రిస్తున్నారు. ఈ చర్యల వల్ల కొంత సత్ఫలితాలు వస్తున్నాయి. గత రెండేళ్లతో పోలిస్తే 2022లో రోడ్డు ప్రమాదాలు, మరణాలు తగ్గుముఖం పట్టడమే దీనికి నిదర్శనం. ఈ ఏడాది మరింత తగ్గుదల కనిపించేలా పనిచేస్తున్నామని పోలీసులు చెబుతున్నారు. అతివేగం, నిర్లక్ష్యం, మద్యం సేవించడం వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నట్టు పోలీసు, రవాణాశాఖలు గుర్తించాయి.



చిలకలూరిపేటలో జాతీయ రహదారిపై ప్రమాదాల నియంత్రణకు చేపట్టిన చర్యలు

97 స్పాట్ల గుర్తింపు
జిల్లాలో గత రెండు సంవత్సరాలలో రెండు, అంతకన్నా ఎక్కువ ప్రమాదాలు జరిగిన ప్రదేశాలు 97 ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఆ ప్రదేశాలలో పోలీస్, రవాణా, నేషనల్ హైవేస్, ఆర్‌అండ్‌బీ శాఖలు సంయుక్త సర్వే నిర్వహించి ప్రమాదాలు జరగడానికి గల కారణాలను విశ్లేషించాయి. ఎక్కువగా రోడ్ జంక్షన్ల వద్ద ప్రమాదాలు జరుగుతున్నట్టు గుర్తించామని జిల్లా రవాణాశాఖ అధికారి టీకే పరంధామరెడ్డి తెలిపారు. జంక్షన్ల వద్ద వేగాన్ని నియంత్రించకపోవడమూ కారణమని ఆయన అభిప్రాయపడ్డారు. ఎన్‌హెచ్-16పై గణపవరం-తిమ్మాపురం, నార్కట్‌పల్లి-అద్దంకి హైవేలో పొందుగుల, గురజాల రోడ్ జంక్షన్, గుంటూరు-పిడుగురాళ్ల రహదారిలో కంటిపూడి, పిడుగురాళ్ల మండలం కామేపల్లి, ముప్పాళ్ళ, గుంటూరు-శ్రీశైలం రోడ్‌లో అందుగలపాడు, రావిపాడు గ్రామాల వద్ద ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నట్టు అధికారులు గుర్తించారు. అవీ మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 9 గంటల మధ్య ఎక్కువగా జరుగుతున్నట్లు పోలీసులు విశ్లేషిస్తున్నారు. ఆ సమయంలో సుమారు 40 శాతం ప్రమాదాలు సంభవిస్తున్నాయని చెబుతున్నారు.

11 శాతం ప్రమాదాలు తగ్గించాం



రోడ్డు ప్రమాదాల నివారణకు అధిక ప్రాధాన్యమిస్తున్నాం. ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలు, సమయం, కారణాలు, తీసుకోవాల్సిన చర్యలపై శాస్త్రీయంగా అధ్యయనం చేసి, చర్యలు చేపడుతున్నాం. పోలీసుశాఖ చేపట్టిన చర్యలు మంచి ఫలితాన్ని ఇచ్చాయి. 2021తో పోలిస్తే 2022లో ప్రమాదాలు 11 శాతం, గాయాలు 10.7 శాతం, మరణాలు 13.5 శాతం తగ్గాయి. ఈ ఏడాది రోడ్డు ప్రమాదాలు మరింత గణనీయంగా తగ్గేలా పోలీసుశాఖ పనిచేస్తోంది. అతివేగం, మద్యం సేవించడం, జంక్షన్ల వద్ద రోడ్డు క్రాస్ చేస్తున్న సమయంలో అజాగ్రత్త ప్రమాదాలకు కారణంగా కనిపిస్తున్నాయి.

– వై.రవిశంకర్‌రెడ్డి, పల్నాడు ఎస్పీ

మూడేళ్లుగా ప్రమాదాల వివరాలు

సంవత్సరం	ప్రమాదాలు	మరణాలు	క్షతగాత్రులు
2020	742	400	668
2021	793	445	739
2022	708	386	660

రహదారుల వారీగా ప్రమాదాలు

సంవత్సరం	జాతీయ రహదాలు	రాష్ట్ర దారులు	అంతర్గత రోడ్లు
2020	181	352	209
2021	211	368	214
2022	211	253	244

వాహనాల వారీగా ప్రమాదాలు ..

సంవత్సరం	ద్విచక్రవాహనాలు	ఆటోలు	కార్, జీపు, ట్యాక్సీలు	బస్సులు	ట్రక్కులు	ఇతర వాహనాలు
2020	248	84	145	36	182	47
2021	289	74	151	37	186	56
2022	238	75	129	40	177	49

పర్యాటక కేంద్రంగా కోటప్పకొండ
- కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- ఆధ్యాత్మిక కేంద్రంలో వేదిక నిర్మాణానికి శంకుస్థాపన



కోటప్పకొండలో వేదిక నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం కోటప్పకొండను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్టు కలెక్టర్ లోతేటి శివశంకర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కోటప్పకొండ మెట్ల మార్గం సమీపంలోని ఏపీ టూరిజం ఎమ్యూజ్‌మెంట్ పార్క్‌లో యాంఫిథియేటర్ వద్ద వేదిక నిర్మాణానికి బుధవారం కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ కోటప్పకొండను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని జలవిహార్‌ను ప్రారంభించామని పేర్కొన్నారు. ఎమ్యూజ్‌మెంట్ పార్క్‌లో సాంస్కృతిక ప్రదర్శనల నిర్వహణకు వీలుగా ఇప్పటికే ఉన్న యాంఫిథియేటర్ వద్ద వేదిక నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. వెయ్యి మంది ప్రదర్శనలు తిలకించేలా థియేటర్ నిర్మాణం జరిగిందని పేర్కొన్నారు. రూ.7 లక్షలతో వేదిక నిర్మాణానికి ముందుకు వచ్చిన బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్‌ను ఆయన అభినందించారు. ప్రతి శని, ఆదివారాల్లో ఇక్కడ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. కోటప్పకొండకు వచ్చే యాత్రికులకు భక్తిభావంతోపాటు మానసిక ఉల్లాసం కలిగేలా పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యే జలవిహార్‌లో బోటు షికారు చేశారు.

ఈనెల 8న ట్రెక్కింగ్...

కోటప్పకొండ ప్రధాన ఆలయం వద్ద నుంచి పాత కోటయ్య స్వామి ఆలయం వరకు ఈనెల 8వ తేదీన ట్రెక్కింగ్ నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి తెలిపారు. పాతకోటయ్య స్వామి ఆలయానికి మెట్ల మార్గం నిర్మించేందుకు నిర్ణయించామన్నారు. కాలినడక మార్గాన్ని వెడల్పు చేస్తున్నట్ట తెలిపారు. ట్రెక్కింగ్‌లో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, కలెక్టర్ లోతేటి శివశంకర్, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో డీఆర్వో వినాయకం, జిల్లా పర్యాటకశాఖ అధికారి జాన్ బెన్ని, డీఆర్డీఏ పీడీ బాలునాయక్, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణరెడ్డి, తహసీల్దార్ రమణానాయక్, జెడ్పీటీసీ పి.చిట్టిబాబు, ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, డాక్టర్ కృష్ణకాంత్, లింగంగుంట్ల మాజీ సర్పంచ్ పొన్నపాటి ఈశ్వరరెడ్డి, సర్పంచ్ వెన్నపూస నాగిరెడ్డి, మట్లా లింగారెడ్డి, ముక్కు వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గృహనిర్మాణాల్లో అలసత్వం తగదు
గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి



డ్రోన్ కెమెరా ఎగురవేస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

పొన్నూరు: జగనన్న కాలనీల్లో చేపట్టిన గృహనిర్మాణాల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. నిడుబ్రోలులోని అర్బన్ లేఅవుట్‌లో గృహ నిర్మాణాలను బుధవారం కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం అధికారులతో సమావేశమయ్యారు. నాలుగువేల మంది లబ్ధిదారులకు నివేశన స్థలాలను ప్రభుత్వం అందించిందని, గృహ నిర్మాణాలకు రూ.లక్షా 80 వేలు, డ్వాక్రా తరపున మరో రూ.35 వేలు, ఇసుక ఉచితంగా, ఇనుము, సిమెంట్‌ను రాయితీపై అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇన్ని అవకాశాలు ఇస్తున్నా.. గృహ నిర్మాణాలు నత్తనడకగా సాగుతున్నాయని అసహనం వ్యక్తం చేశారు. అధికారులు నిబద్ధతతో పనిచేయాలన్నారు. నిర్మాణాల్లో పొన్నూరు వెనుకబడిందని చెప్పారు. తక్షణం అధికారులందరూ సమన్వయంతో పనిచేసి నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. లే అవుట్‌లో కొన్ని రోడ్లు దెబ్బతిన్నాయని, మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. కాలనీలో జనవరి 15నాటికల్లా మౌలిక వసతులు కల్పించాలని సూచించారు.

వివాదాల పరిష్కారానికే భూరక్ష

భూ వివాదాల పరిష్కారానికే భూ రక్ష సర్వే చేపట్టామని కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి చెప్పారు. నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో బుధవారం డ్రోన్ కెమెరాతో ఆయన సర్వేను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని వివరించారు. పొన్నూరులో మొత్తం 15 రోజుల పాటు సర్వే జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి నారాయణరావు, రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ సభ్యులు షేక్ సైపుల్లా, మున్సిపల్ కమిషనర్ ఎస్.రాధ, పెదకాకాని తహసీల్దార్ రత్నం, ఎంపీడీఓ మారుతి శేషమాంబ పాల్గొన్నారు.

గుంటూరు జిల్లా ఓటర్లు 17,11,082
గుంటూరు వెస్ట్: భారత ఎన్నికల సంఘం జిల్లా ఓటర్ల లిస్టులను గురువారం ప్రకటించనుంది. జిల్లాలో ఏడు నియోజకవర్గాలకు కలిపి మొత్తం ఓటర్ల సంఖ్య 17,11,082. ఇందులో మహిళలదేపైచేయి. మహిళలు 8,81,965, పురుషులు 8,26,234 కాగా ట్రాన్స్‌జెండర్స్ 230 మంది ఉన్నారు. ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు 814, సర్వీసు ఓటర్లు 1,839 మంది ఉన్నారు. ఈ సంవత్సరంలో 18 ఏళ్ళు నిండిన వారుంటే ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ చివరి వరకు నమోదు చేసుకునే వెసులుబాటును కల్పించారు. జిల్లాలో ఆధార్‌తో ఓటర్ కార్డు అనుసంధాన కార్యక్రమం ఇప్పటికే 70 శాతంపైగా పూర్తి చేశారు.

గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

బాపట్ల: గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు ఉత్తమ సేవలు అందించే బాధ్యత డిజిటల్ అసిస్టెంట్లపై ఉందని కలెక్టర్ కె.విజయకృష్ణన్ స్పష్టం చేశారు. సంతమాగులూరు, నగరం మండలాల్లోని సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లతో బుధవారం కలెక్టరేట్‌లో ఆమె సమావేశమయ్యారు. విధి నిర్వహణలో అలసత్వం తగదని సూచించారు. ప్రభుత్వ పథకాలన్నింటిపైనా అవగాహన అవసరమన్నారు. ప్రభుత్వ సేవలన్నింటినీ ప్రజలకు అందించే బాధ్యత డిజిటల్ అసిస్టెంట్లపై ఉందన్నారు. విద్యుత్ బిల్లుల చెల్లింపులు సచివాలయాల్లోనే జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చెప్పారు. కొన్ని సచివాలయాలలో విద్యుత్ బిల్లులు నమోదు కాకపోవడంపై కలెక్టర్ ఆరాతీశారు.

పురుగు మందు తాగి మున్సిపల్ ఉద్యోగి మృతి



నల్లమోతు నర్సింహారావు (ఫైల్)

బాపట్ల: బాపట్ల మున్సిపల్ హెల్త్ వర్కర్‌గా పనిచేస్తున్న నల్లమోతుల నర్సింహారావు (50) పురుగుల మందు తాగి ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నారు. దివ్యాంగుడైన నర్సింహారావు మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదుల స్వీకరణ విభాగంలో పనిచేస్తున్నారు. మున్సిపల్ కార్యాలయంలో అధికారుల సంతకాలు ఫోర్జరీ చేశారనే ఆరోపణలపై విచారణ నిమిత్తం గత నెల 29వ తేదీ నర్సింహారావును సస్పెండ్ చేశారు. ఈ నేపథ్యంలో తీవ్ర మనస్థాపానికి గురైన నర్సింహారావు అద్దెకు ఉంటున్న ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులపై టీడీపీ నేతల ప్రవర్తన దుర్మార్గం

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు

చెరుకుపల్లి: తెలుగుదేశం పార్టీ అధినాయకుడు చంద్రబాబు నాయుడు తన స్వార్థపూరిత పబ్లిసిటీ కోసం ప్రజల ప్రాణాలతో చలగాటం ఆడుతూ నీచ రాజకీయాలు చేస్తున్నారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు ఆవేదన వ్యక్తం చేశారు. చెరుకుపల్లిలో విలేకరుల సమావేశంలో బుధవారం మోపిదేవి మాట్లాడుతూ చంద్రబాబు సభలకు ప్రజలను మభ్యపెట్టి ఇరుకు ప్రదేశాలకు తరలించి, అమాయక ప్రజల ప్రాణాలు బలితీసుకుంటూ ఎటువంటి పశ్చాత్తాపం లేకుండా తన ధన బలంతో ప్రాణాలకు వెలకట్టి చేతులు దులుపుకుంటున్నారన్నారు. చంద్రబాబు ప్రచార ఆర్భాటం కోసం ఆ నాడు పుష్కరాల్లో 26 మందిని, ప్రకాశం జిల్లా కందుకూరులో 8 మందిని, ఆ తర్వాత రెండు రోజులు గడవక ముందే గుంటూరులో చంద్రన్న కానుకల పంపిణీ అని తన ఎల్లో మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేయించి 30 వేల మందికి టోకెన్లు పంపిణీ చేసి తీరా 2 వేల మందికి మాత్రమే అందించే క్రమంలో తొక్కిసలాట జరిగి ముగ్గురు ప్రాణాలు బలితీసుకున్నారని, కొంత మంది గాయాల పాలయ్యారన్నారు. ఇంత దారుణంగా అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయినా చంద్రబాబు భజనపరుడు పవన్ కళ్యాణ్ గాని, వామపక్ష నాయకులు కానీ కనీసం నోరు విప్పకపోవడం నీచాతినీచమని ధ్వజమెత్తారు. ఇటువంటి చర్యలను కట్టడి చేసేందుకు ప్రజల ప్రాణాలు కాపాడేందుకు, శాంతి భద్రతల పరిరక్షణకు రాజకీయ పార్టీలు ఎక్కడ పడితే అక్కడ సభలు నిర్వహించి ప్రజల రాకపోకలు, రవాణా సౌకర్యాలకు ఇబ్బంది కలగకుండా ఉండే విధంగా అధికార పక్షంతో సహా అనుమతులు తీసుకొని సభలు నిర్వహించుకునే విధంగా ప్రభుత్వం జీఓ జారీ చేస్తే అది తప్పు అంటూ వారి రాజకీయ ప్రయోజనాల కోసం హడావుడి చేయడం దుర్మార్గ చర్య అని పేర్కొన్నారు. బుధవారం కుప్పంలో విధుల్లో ఉన్న పోలీసులపై చంద్రబాబు నాయుడు, టీడీపీ శ్రేణులు రెచ్చిపోయి చేయిచేసుకోవడం చాలా దుర్మార్గమైన చర్యన్నారు. మరోమారు ఇటువంటి దురాగతం జరగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మత్తి దివాకరరత్న ప్రసాద్, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

మార్టూరు: మండలంలోని ద్రోణాదుల సాగర్ కాలువలో బుధవారం గుర్తుతెలియని మృతదేహాన్ని కనుగొన్నారు. ఎస్‌ఐ రవీంద్రారెడ్డి కథనం మేరకు.. ద్రోణాదుల సమీపంలోని నాగార్జున సాగర్ కాలువపై ఉన్న ఓబయ్య బ్రిడ్జి వద్ద నీటిలో తేలాతున్న మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు వీఆర్వో నాగేశ్వరరావుకు సమాచారం అందించారు. వీఆర్వో సమాచారంతో సీఐ ఫిరోజ్ ఘటనా స్థలానికి చేరుకొని స్థానికుల సహకారంతో మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడు వయస్సు సుమారు 20 నుంచి 40 ఏళ్ల మధ్య ఉండవచ్చని, గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. వివరాలు తెలిసిన వారు 91211 02151 నంబరుకు సమాచారం అందించాలని చెప్పారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని మార్టూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నేడు కోటప్పకొండలో ముక్కోటి ఆరుద్రోత్సవం

నరసరావుపేట రూరల్: కోటప్పకొండలోని త్రికోటేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 5వ తేదీ ముక్కోటి ఆరుద్రోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో వేమూరి గోపి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధనుర్మాసంలో వచ్చే ఆరుద్ర నక్షత్రం, పౌర్ణమి రోజును పురస్కరించుకుని 5న అర్ధరాత్రి నుంచి స్వామి వారికి విశేష ద్రవ్యాలతో అభిషేకాలు జరుగుతాయని పేర్కొన్నారు. మేధా దక్షిణామూర్తి, త్రికోటేశ్వరస్వామికి విశేష పుష్పాలంకరణ జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి విశేష అభిషేకాలు దర్శించి, తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

స్పెషల్ పీపీగా జీఎస్‌పీ రెడ్డి నియామకం



గొట్టం శివప్రసాదరెడ్డి

గుంటూరు లీగల్: క్రైం ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సీఐడీ) తరఫున గుంటూరులోని మేజిస్ట్రేట్, సెషన్స్ కోర్టుల్లో కేసులు వాదించేందుకు గుంటూరు బార్ అసోసియేషన్ న్యాయవాది గొట్టం శివప్రసాదరెడ్డిని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ హరీష్‌కుమార్ గుప్తా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2002లో న్యాయవాద వృత్తిని ప్రారంభించిన ప్రసాదరెడ్డి క్రిమినల్, సివిల్, ఎంవీటీపీ, వినియోగదారుల కేసుల్లో అనుభవాన్ని గడించారు. ఆయన ఈ పదవిలో మూడేళ్ల పాటు కొనసాగనున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు సీనియర్ న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

ప్రమాణ పత్రం సమర్పించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: భవిష్యనిధి పెన్షన్‌దారులు తమ వ్యక్తిగత జీవన ప్రమాణ పత్రాన్ని సమర్పించాలని కృష్ణనగర్‌లోని ఉద్యోగుల భవిష్యనిధి ప్రాంతీయ కార్యాలయ రీజనల్ పీఎఫ్ కమిషనర్ ఎస్.శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈపీఎస్, ఈపీఎస్–1971 పెన్షనర్లు ప్రతి ఏడాది నూతన జీవన ప్రమాణ పత్రాలను సమర్పించడం ద్వారా పెన్షన్ సేవలను నిరంతరాయంగా పొందవచ్చని పేర్కొన్నారు. బ్యాంకు, సీఎస్‌సీ కేంద్రంతో పాటు పోస్ట్ ఇన్ఫో యాప్ ద్వారా తమ అభ్యర్థనను నమోదు చేసుకుంటే పోస్ట్‌మెన్ ఇంటికి వచ్చి వేలిముద్ర, ఐరిష్ ద్వారా జీవన ప్రమాణ పత్రాన్ని స్వీకరిస్తారని తెలిపారు. ఆండ్రాయిడ్ ఫోన్ ద్వారా ఆధార్ ఫేస్ యాప్, జీవన ప్రమాణ ఫేస్ అప్లికేషన్‌ను ఉపయోగించి ప్రమాణ పత్రాన్ని సమర్పించాలన్నారు.

డ్వాక్రా యూనిట్ల గ్రౌండింగ్ పూర్తిచేయాలి

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కె.విజయకృష్ణన్

బాపట్ల: పొదుపు మహిళల జీవనోపాధి వృద్ధికి అవసరమైన యూనిట్లను అధికారులు తక్షణమే గ్రౌండింగ్ చేయాలని జిల్లా కలెక్టర్ కె.విజయకృష్ణన్ ఆదేశించారు. జీవనోపాధుల అభివృద్ధిపై డీఆర్‌డీఏ అధికారులతో బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో ఆమె సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ చేయూత పథకం కింద పొదుపు మహిళలకు రుణాలు ఇప్పించాలన్నారు. పెరటికోళ్ల పెంపకం, డెయిరీ ఫాం, గొర్రెలు, మేకల పెంపకానికి అధికంగా రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. బాపట్ల జిల్లాలో 25 మండలాలు ఉండగా, ఒక్కో మండలం పరిధిలో 500 పెరటికోళ్ల యూనిట్లు మంజూరు చేయించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 2,500 గేదెల యూనిట్లు స్థాపించేలా చూడాలని చెప్పారు. మేకలు, గొర్రెలు, పొట్టేళ్ల యూనిట్లు మరో 2,500 మంజూరు చేయించాలన్నారు. ఈ పథకాల ద్వారా మహిళల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని తెలిపారు. యూనిట్లను సత్వరమే విడుదల చేస్తే పొదుపు మహిళలు త్వరగా లబ్ధి పొందే అవకాశం ఉంటుందన్నారు. జనవరిలో 305 గేదెల యూనిట్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నామని అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. బడుగు వికాసం పథకం కింద జిల్లాలో 625 యూనిట్లు స్థాపించాలన్నారు. 910 దరఖాస్తులు రాగా 206 మందికి వివిధ రకాల యూనిట్లు గ్రౌండింగ్ చేయడానికి బ్యాంకులు అనుమతించడంపై కలెక్టర్ ఆరా తీశారు. 45 శాతం ప్రభుత్వం రాయితీపై ప్రజలకు అవగాహన కల్పించాలని, లక్ష్యాలు నిర్దేశించుకుంటూ అధికారులు పనిచేయాలని సూచించారు. పొదుపు మహిళల ఆదాయ వనరులు పెంచడానికే ప్రభుత్వం కృషి చేస్తుందని వివరించారు. జగనన్న కాలనీల్లో లక్ష్యం మేరకు పక్కా గృహాల నిర్మాణాలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గృహ నిర్మాణాలపై పీఆర్ ఇంజినీరింగ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇప్పటి వరకు గృహ నిర్మాణాలు ప్రారంభించిన లబ్ధిదారులందరికీ రుణ సదుపాయం కల్పించాలన్నారు. సిమెంటు, ఇసుక, నీటి కొరత రానివ్వకుండా ఇంజినీరింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. పునాది దశలో ఉన్న గృహాలు లెంటిల్ దశకు చేరుకునేలా లబ్ధిదారులను చైతన్యపరచాలన్నారు. శ్లాబ్ ముగిసిన గృహాలను త్వరగా పూర్తిచేసేలా చూడాలన్నారు. గృహ నిర్మాణాల్లో ప్రతి వారం పురోగతి కనిపించాలని దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తోందనే విషయాన్ని అధికారుల పనితీరు ఆధారంగా ప్రజలు తెలుసుకునేలా చేయాలన్నారు. ఇంజినీరింగ్ అధికారులు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. మండల స్థాయి అధికారులను సమన్వయం చేసుకుంటూ పురోగతి దిశగా పయనించాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌డీఏ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్లు, పీఆర్ డివిజనల్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

తెలుగువారి గుండెల్లో ప్రతిధ్వనించే కవి వేమన

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి

పట్నంబజారు(గుంటూరుతూర్పు): తెలుగువారి గుండెల్లో నిరంతరం ప్రతిధ్వనించే ప్రజాకవి వేమన అని శాసనమండలి సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి కీర్తించారు. 500 సంవత్సరాలు గడిచిపోయినా కూడా మన నాలుకల మీద నాట్యమాడుతున్న ఆయన పద్యాలే అందుకు సజీవ సాక్ష్యాలన్నారు. బాలభారతి వ్యవస్థాపక అధ్యక్షుడు యర్రం సాంబిరెడ్డి సేకరించి విశ్వదాభిరామ వినురవేమ పేరుతో వేమన పద్య రత్నావళి పుస్తకాన్ని బృందావన్ గార్డెన్స్‌లోని ఆయన కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ నేటి సమాజంలో కనీసం తల్లిదండ్రులను సైతం పట్టించుకోని పరిస్థితుల్లో ఉంటున్నారని, ఇక సాటివారి పట్ల ఏమాత్రం బాధ్యత ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో మనుషులందరినీ తట్టి మేల్కొల్పడానికి అక్షరాన్ని అణ్వాయుధంగా, పద్యాన్ని పాశుపతాస్త్రంలా మలిచిన వేమన పద్య రత్నావళి ఎంతగానో దోహదపడుతుందన్నారు. యర్రం సాంబిరెడ్డి మాట్లాడుతూ వానకు తడవని వారు, వేమన పద్యాన్ని వినని తెలుగువారు బహుశా ఉండరన్నారు. యోగి వేమన జయంతిని ప్రభుత్వం ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించడానికి జీవో విడుదల చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ కొమ్మాలపాటి మోజెస్ పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

వివరాలు వెల్లడించిన పట్టణ సీఐ బాలకృష్ణ



వివరాలు తెలుపుతున్న సీఐ బాలకృష్ణ

మాచర్ల: పట్టణంలోని వినాయకునిగుట్ట వద్ద గత నెల 31వ తేదీ భార్య వల్లెబోయిన అంజలిని హత్య చేసిన వల్లెబోయిన లక్ష్మయ్యను రూరల్ ప్రాంతంలోని కొత్తపల్లి జంక్షన్ వద్ద మంగళవారం రాత్రి అరెస్ట్ చేసినట్లు అర్బన్ సీఐ టి.బాలకృష్ణ బుధవారం తెలిపారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించిన హత్య కేసుకు సంబంధించి వివరాలు వెల్లడించారు. 13 ఏళ్ల కిందట గురజాలకు చెందిన వల్లెబోయిన లక్ష్మయ్యకు మాచర్ల పట్టణానికి చెందిన అంజలికి వివాహమైంది. రెండేళ్ల తర్వాత నిందితుడు గొడవలు పడుతూ భార్యకు దూరంగా ఉంటున్నారు. నిందితుడు మృతురాలు అంజలితో గత నెల 31వ తేదీ గొడవపడి ఆమెను నాపరాయి తీసుకొని తలపై కొట్టి తీవ్రంగా గాయపరిచాడు. ఆమెను ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. నిందితుడు పారిపోయాడు. ఈ నేపథ్యంలో కొత్తపల్లి జంక్షన్ వద్ద నిందితుడిని అరెస్ట్ చేసి గురువారం కోర్టులో హాజరుపరచనున్నట్లు సీఐ చెప్పారు. సమావేశంలో అర్బన్ ఎస్‌ఐలు కె.అరుణ, సౌందర్‌రాజన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

యోగా సాధనతో ఆరోగ్యం పదిలం

- జాయింట్ కలెక్టర్ రాజకుమారి
- కలెక్టరేట్ ఉద్యోగులకు యోగా శిక్షణ



యోగ సాధనలో జేసీ రాజకుమారి

గుంటూరు వెస్ట్: మన ఆరోగ్యం మన చేతుల్లో ఉండాలంటే ప్రతి రోజూ కనీసం గంట సమయం యోగ సాధన చేయాలని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. బుధవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ ఆవరణలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరం వద్ద కలెక్టరేట్ ఉద్యోగులకు నిర్వహించిన యోగా శిక్షణ తరగతుల అనంతరం జేసీ మాట్లాడారు. జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి చొరవతో నిర్వహిస్తున్న యోగ శిక్షణ ప్రభుత్వ ఉద్యోగులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ఉద్యోగులు కుటుంబ బాధ్యతలు, విధి నిర్వహణలో పడి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తుంటారన్నారు. ఈ క్రమంలో 40 ఏళ్లు దాటిన వారికి మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్, బ్యాక్ పెయిన్, గ్యాస్ట్రిక్ తదితర సమస్యల బారిన పడుతుంటారన్నారు. యోగాతో మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందన్న వాస్తవాన్ని గుర్తించాలని చెప్పారు. డీఆర్వో చంద్రశేఖరరావు మాట్లాడుతూ బుద్ధ యోగ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల రోజులపాటు ఉద్యోగులకు ఉచిత యోగ శిక్షణనిస్తారన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఉన్న ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ భాస్కర నాయుడు, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, డ్వామా పీడీ యుగంధర్ కుమార్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.వెంకటేశ్వర్లు, డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ సుమయా ఖాన్, అధికారులు పాల్గొన్నారు.

నృసింహుడి ఆదాయం రూ.22.58 లక్షలు



నృసింహస్వామి హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్త బృందం

మంగళగిరి: వైకుంఠ ఏకాదశి సందర్భంగా నగరంలో వేంచేసిఉన్న లక్ష్మీనృసింహస్వామి ప్రత్యేక హుండీల ఆదాయం రూ.22,58,831 సమకూరింది. బుధవారం ఆలయంలోని దిగువ సన్నిధి ఆవరణలో హుండీల్లో కానుకల లెక్కింపు చేపట్టారు. ఎగువ సన్నిధిలో రూ.10,12,342, దిగువ సన్నిధిలో రూ.9,38,728 ఆదాయం వచ్చింది. క్లాత్ హుండీల ద్వారా రూ.2,58,592, ఘాట్‌రోడ్డుపై వేంచేసిఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయం హుండీ ఆదాయం రూ.36,800, అన్నదానానికి రూ.12,369 ఆదాయం సమకూరింది. అమెరికన్ డాలర్లు 113, సింగపూర్ డాలర్లు 2, నేపాల్ రూపీస్ 40, సౌదీ అరేబియా రియాల్స్ 2, బంగారం 5 గ్రాముల 850 మిల్లీ గ్రాములు, వెండి 67 గ్రాముల 800 మిల్లీ గ్రాములు వచ్చినట్లు ఆలయ ఈఓ ఎ.రామకోటిరెడ్డి తెలిపారు. లెక్కింపు కార్యక్రమాన్ని దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

గుట్కా, మద్యం కంటైనర్ స్వాధీనం

- పట్టుబడిన రూ.12.60 లక్షల విలువైన గుట్కా
- 240 క్వార్టర్ బాటిళ్లు గుర్తింపు



నిందితులతో సెబ్ అధికారులు

గురజాల: భారీగా గుట్కా ప్యాకెట్లు, మద్యంలో తెలంగాణ మద్యం బాటిళ్లు తరలిస్తున్న కంటైనర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో అసిస్టెంట్ ఎన్‌ఫోర్సుమెంట్ సూపరింటెండెంట్ డీఎస్ దుర్గాప్రసాద్ తెలిపారు. స్థానిక సెబ్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటక నుంచి గుట్కా ప్యాకెట్లు తీసుకువస్తూ వాటి మధ్యలో తెలంగాణ మద్యం ఉంచి తరలిస్తున్నారు. ఉన్నతాధికారులకు అందిన ముందస్తు సమాచారం మేరకు దాచేపల్లి మండలంలోని పొందుగుల వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు. కంటైనర్‌ను తనిఖీ చేయగా గుట్కా ప్యాకెట్ల మధ్యలో 5 కేసుల తెలంగాణ మద్యాన్ని కూడా గుర్తించడం జరిగింది. డ్రైవర్ పి.రాంబాబును విచారించగా గుట్కా ప్యాకెట్లు శావల్యాపురానికి చెందిన పి.లింగారావుకు చెందిన సరుకుగా తెలిపారు.

డీఎంహెచ్ఓ కార్యాలయ వాహనాలకు ఆన్‌లైన్ ఆక్షన్

గుంటూరు మెడికల్: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖకు చెందిన 43 వినియోగంలోలేని వాహనాలను ఆన్‌లైన్ ద్వారా వేలం వేస్తున్నట్లు గుంటూరు జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ సుమయఖాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా ఆక్షన్ జరుగుతుందన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు కొనుగోలు.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు.